# నా కోసం

-డా॥ సి. భవానీదేవి

"మా యింటికి కాసేపు వచ్చిపోతారా, ప్లీజ్" పద్మ బ్రతిమిలాడింది.

"అమ్మో! వద్దు పద్మా! మా నాన్నకి తెలిస్తే చంపేస్తారు" గుండెలపై చేయి వేసుకొని కళ్ళింత పెద్దవి చేసి భయంగా అన్నది తార.

"పోవే మరీనూ! పది నిమిషాలు కాలేజీ నించి లేటు అయితే చంపేస్తారా ఏంటి? అంతగా భయపడే దాన్ని నిన్నే చూస్తున్నా! అయినా.. డాడీ అంటే ఉండాల్సింది గౌరవం గానీ భయం కాదు. ఇవ్వాళ మా మమ్మీ బర్త్‌డే.. ప్లీజ్ తారా! నువ్వు గాక నాకింక ఫ్రెండ్స్ ఎవరున్నారు చెప్పు" పద్మ మళ్ళీ బ్రతిమిలాడాక తార మనసు మెత్తబడింది. ఇంక కాదనలేకపోయింది.

మనసులో వాళ్ళింటికి వెళ్ళాలనే.. కానీ.. నాన్న ఏమైనా అంటారనే భయం.

ముఖ్యంగా తార వాళ్ళ డాబా మీద గది.. ఎంత బావుంటుంది.. చల్లని గాలి.. కిటికీలకు పూల డిజైను కర్టెన్లు.. కింది నుంచి పైకి పాకించిన జాజిచెట్టు పూయించే పూల పరిమళాలు.. ఈ వాతావరణంలో మెత్తటి పరుపుమీద పడుకొని ఎంతో ఇష్టమైన లతా మంగేష్కర్ పాట వింటూ.. ఇష్టమైన నవల చదువుకుంటుంటే.. జీవితంలో ఇంకేమీ అక్కర్లేదనిపిస్తుంది. నిజంగానే పద్మ చాలా అదృష్టవంతురాలు.. ఒక్కతే కూతురు కదా! చాలా అపురూపంగా తల్లి దగ్గర గారాబాలు పోతుంటే ఎప్పటికప్పుడు కొత్తగా చూడాలనిపిస్తుంది.

ఆలోచనల్లోనే పద్మ వాళ్ళిల్లు వచ్చేసింది. గమనించనే లేదు.. ఇరువైపులా గులాబీల కుండీలు స్వాగతం పలుకుతుంటే లోపలికి వెళ్ళారు స్నేహితులిద్దరూ.

నీట్‌గా సర్ది ఉంది హాలు. కూర్చుంటూనే 'మమ్మీ' అంటూ కేకేసింది పద్మ.

'అరె.. మీరు వచ్చేశారా' అంటూ పద్మ వాళ్ళమ్మ వచ్చారు.

తలంటుకున్నారేమో ఫ్రెష్‌గా కన్పించారు. తెల్లటి చీర మీద మెరూన్ కలర్ పూలు.. మెరూన్ బ్లౌజ్.. పుట్టిన రోజు ప్రత్యేక అలంకరణే కన్పించలేదు.

"మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ద డే ఆంటీ.." తార చెప్పిన గ్రీటింగ్స్‌కి స్నేహంగా నవ్విందామె.

నవ్వినప్పుడు ఆవిడ బుగ్గలపై పడే సొట్ట చాలా అందంగా అన్పిస్తుంది తారకు.

"నాకు బర్త్‌డే అంటూ ప్రత్యేకంగా సెలబ్రేట్ చేసుకునే అలవాటేమీ లేదమ్మా! పద్మ కోసమే! కూర్చోండి" అంటూ లోపలికి వెళ్ళి కొంచెం స్వీటు, హాటు, తర్వాత కూల్‌డ్రింక్ ఇచ్చారామె.

తార మొహమాటపడినా వదిలిపెట్టలేదిద్దరూ! బలవంతాన అవి తీసుకుని థాంక్స్ చెప్పి ఇంటికి బయలుదేరింది తార.

తండ్రి లేకపోయినా పద్మ, వాళ్ళమ్మ ఆనందంగానే కన్పిస్తారు. తండ్రికీ తల్లికీ ఏవో మనస్పర్థలొచ్చాయనీ, తల్లి భర్త నుంచి విడిపోయి బ్రతుకుతున్నదనీ పద్మ ఎప్పుడో ఓసారి చెప్పినట్లు గుర్తు. ఇప్పుడు వాళ్ళున్న ఇల్లు కూడా వాళ్ళ తాతగారిచ్చిందే! పద్మ వాళ్ళింట్లో ఉన్నంతసేపు మనసుకు ఎంత ప్రశాంతత! స్నేహపూర్వకమైన లాలన! అధికారం గానీ, బెత్తంలాంటి జులుం గానీ లేని హాయి ఆ గాలిలోనే ఉంది!

తమ ఇల్లు సమీపిస్తున్నదంటే తార మనసు ముడుచుకుపోతున్నది. తమ ఇంట్లో నాన్న, అమ్మ కలిసే ఉంటారు.. కానీ ఏదో అశాంతి. ఎప్పుడూ యుద్ధ వాతావరణం, టెన్షన్. ఆధిపత్యం కోసం చేసే పోరాటం.. మనసుల్ని గురించి పట్టించుకోని అహంకారపు చెలాయింపు.

నాన్న అమ్మని ఎప్పుడైనా జీవిత భాగస్వామిలా చూశాడా! పిల్లల్ని కని, జీతం లేకుండా ఇంటి చాకిరీ చేసే యంత్రంలా చూస్తాడంతే! వాళ్ళిద్దరూ పాలూ నీళ్ళలా కలిసిపోయే భార్యాభర్తలు కారు. పందాలలో పోరాడే కోడిపుంజుల్లా కన్పిస్తుంటారు. అమ్మ వ్యక్తిత్వాన్ని ఎంతగా అణచేసుకుంటే అంతలా నాన్న విజృంభిస్తారెందుకో.

నాల్రోజుల క్రితం జరిగిన సంఘటన తాలూకు గాయం ఇంకా పచ్చిగానే తార హృదయాన్ని సలుపుతున్నది.

తమ వీధిలోనే 'బాలానందం' పిల్లలు ఏవో సాంస్కృ

తిక కార్యక్రమాలున్నాయని వీధికంతటికీ ఆహ్వాన పత్రాలు పంచిపెట్టారు. స్వతహాగా కళాపిపాసి అయిన అమ్మ ఆ కార్యక్రమాలు చూడాలని ఆశపడింది. "నాన్న గారెటూ ఊళ్ళో లేరు గదా! పోదాం రామ్మా" అని తనే కొంచెం పోద్బలం చేసి అమ్మని ఆ కార్యక్రమానికి తీసుకెళ్ళింది. ఆ కార్యక్రమంలో సీత, వివేకానందుల ఏకపాత్రాభినయాలు, సుమతి కృష్ణ శతకాల్లోంచి పద్యాలు పిల్లల ద్వారా విని, చూసి అమ్మ కూడా చిన్న పిల్లలా మారిపోయింది. అంత స్వచ్ఛంగా అమ్మ నవ్వ డం ఇటీవలి కాలంలో తను చూడలేదు. టైము చూసిన అమ్మ మొహంలో కంగారు చోటుచేసుకుంది.

"మీ నాన్నగారొచ్చే వేళయింది. పద పద.." అం టూ కార్యక్రమం పూర్తికాకముందే హడావుడిచేసి తీసు కు వచ్చేసింది.

గుమ్మంలో అడుగు పెట్టేసరికి కాళ్ళు గజగజ వణికి పోయాయి. ఉగ్ర నరసింహమూర్తిలా నాన్న.

"ఏమే ముదనష్టపు.." అంటూ.. ఇంకా ఏవేవో అర్థంకాని అశ్లీల పదాలతో అరుస్తూ జుట్టుపట్టి అమ్మని ఈడ్చుకొని వెళ్ళి గదిలో పడేసి రాక్షసంగా తంతున్న నాన్నని చూస్తే జీవితకాలం క్షమించలేదు తను. చెల్లెళ్ళు చిన్నవాళ్ళు కాబట్టి వాళ్ళకి ఏం జరిగిందీ పూర్తిగా అర్థం అయీ కాకుండా ఉంది. కానీ కొంత ఊహ తెల్సిన తార మనసు అమ్మ పట్ల ఎంతటి ఆర్ద్రభావనతో నిండిపోయిందో రాయటానికి భాష చాలదు.

తెల్లార్లి అమ్మ మొహం చూడటానికే సిగ్గుపడింది తార. ఎందుకంటే అమ్మని ప్రోత్సహించి ఆ కార్యక్రమా నికి తీసుకు వెళ్ళిందే తను గనుక! తన వల్లే అమ్మకి ఆ శిక్ష అని ఆ అమ్మాయి మనసు ఎంతగా వేదన చెందిందో ఆ రాత్రికే తెలుసు.

అమ్మకీ చెర తప్పించాలంటే తను బాగా చదువు కొని మంచి ఉద్యోగం చూసుకొని అమ్మని తీసుకెళ్ళి శాశ్వతంగా తన దగ్గర ఉంచుకొని పువ్వుల్లో పెట్టి చూసుకోవాలి. అంతే! అంతవరకు తనేం చేయలేదు.

ఇంట్లోకి ఎలా వచ్చిందో! ఆలోచనల మధ్య ఏదో నాలుగు మెతుకులు తిని చదవటానికి పుస్తకం తీసింది తార!

"ఏంటమ్మా! అంత పరధ్యానం.. పద్మ వాళ్ళింటికి వెళ్ళివచ్చావా?" తల నిమురుతూ అమ్మ అడుగుతోంది.

"ఏం లేదమ్మా! పద్మ వాళ్ళమ్మ బర్త్‌డే!" అమ్మ కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగింది తార మళ్ళీ..

"అమ్మా! నీ బర్త్‌డే ఎప్పుడు" మళ్ళీ తనే అడిగింది.

ఆవిడ ఉలిక్కిపడింది.

"నాదా!.. నాకే తెలీదు" గొణుక్కుంటూ వంటిం ట్లోకి వెళ్ళిపోయింది.

తన పుట్టుకకే గుర్తింపులేని అమ్మ! చెల్లెళ్ళంతా నిద్రలో ఉన్నారు. లైటు మొహంమీద పడి మొహం చిట్లించింది చిన్నది. తనకి చదువుకోటానికి విడిగా గది ఉంటేగా.. పద్మ గది డాబా మీద.. ఎంత బావుం టుందో! తన అభిరుచులకు అనుగుణంగా తనకిష్టమైన పెయింటింగ్స్‌తో.. ఇష్టమైన వాతావరణంతో తన కం టూ ప్రత్యేకంగా ఓ గది.. ముందు తనకి ఉద్యోగం రావాలి.. అందుకు చదువుకోవాలి.. అంతే! పుస్తకం తీసింది తార. డిగ్రీ రిజల్ట్స్ రాగానే కాంపిటీటివ్ పరీ క్షలు రాయడం దినచర్య అయిపోయింది.

ఉద్యోగం ఆర్డరు రాకముందే హైదరాబాదులో దూరపు బంధువుల అబ్బాయిని ఖాయం చేసుకొచ్చిన తండ్రి నోటి వెంట ఆ వార్త వినగానే తార కళ్ళ ఎదుట ఆశాసౌధాలన్నీ కుప్పకూలిపోయాయి.

తండ్రి ఎదుట మాట్లాడే ధైర్యం ఎటూ లేదు. "నేనీ పెళ్ళి చేసుకోనమ్మా" అమ్మకి చెప్పగలిగింది బాధగా. ఆశ్చర్యంగా చూసిందామె కూతురికేసి.

"ఎందుకని తారా" దగ్గరగా వచ్చి అనునయంగా అడిగింది.

"నేను నా జీవితంలో కొన్ని సాధించాలనుకుంటు న్నాను. నాన్నని చూశాక భర్త అధికారం అంటే అస హ్యం.. భర్త అంటే ప్రేమగా, స్నేహంగా ఉండాలని నా కోరిక. కానీ లోకంలో ఏ భర్తలూ స్నేహంగా ఉండరు అన్పిస్తుంది. అందుకే నాకు పెళ్ళి వద్దు" అంది తార దృఢంగా.

వెన్నెలలా నవ్వింది అమ్మ!

"అంతా నాన్నలా ఎందుకుంటారు తల్లీ! నీ అదృ ష్టం బావుంటే.." అనునయించబోయింది.

"అదే నేననేది.. లాటరీ ఎందుకు.. పెళ్ళి అంటే మన వ్యక్తిత్వాన్ని చంపుకోవటమే! నీకు తల్లీ, తండ్రీ, తోబుట్టువులూ లేరనీ, నిన్ను చంపేసినా అడిగేవాళ్ళు లేరనీ నాన్నకి చులకన.. చాకిరీని నిన్నూ.. విలాసా లకూ.. మరోదాన్ని.. నువ్వుగాబట్టి భరిస్తున్నావు.." అనకూడని మాట నోరుజారింది తార.

అమ్మ కళ్ళ వెంట జలపాతాలు.

"చాలమ్మా! నాలా నీ జీవితం ఎందుకు ఈ ఇంట్లో సమాధి చేస్తావు.. నాకు చదువులేదు కాబట్టి ఊబిలోనే రెక్కలు రాల్చేసుకున్నాను. నీకు చదువు ఉంది. చదు

వుకు విలువ తప్పకుండా ఉంది. నువ్వు కాదంటే నీ తర్వాత చెల్లెళ్ళకూ పెళ్ళి కాదు. మీ కోసమే నేనీ నరకంలో ఉన్నది కూడా!" కళ్ళు తుడుచుకుంటూ నాన్న పిలుపుకు మౌనంగా వెళ్ళిపోయింది అమ్మ.

అమ్మని తను కూడా బాధపెట్టింది. ఆ ఆలోచనే తనమీద తనకు కోపం తెప్పిస్తుంది.

ఎటూ తనకు హైదరాబాద్‌లోనే పోస్టింగ్స్ వస్తున్నాయి. ఈ పెళ్ళి ఒప్పుకోవటం వల్ల తాను పోగొట్టుకునేదేమీ లేదు. తానీ పెళ్ళికి ఒప్పుకోకపోతే అమ్మని నాన్న ఎంత హింస పెడతాడో ఆ అమ్మాయి ఊహించగలదు.

తార అసలు డిగ్రీ దాకా చదువుకోవటమే ఆ తండ్రికి ఇష్టంలేదు. ఆడపిల్లల్ని ఎక్కువగా చదివిస్తే వాళ్ళు మాట వినరన్న వివేకమున్న మనిషి ఆయన. పిల్లలు ఏ విషయంలోనైనా తన మాట వినరనిపిస్తే భార్యని హింసించి ఆ విధంగా పిల్లల్ని ఎక్స్‌ప్లాయిట్ చేయగల సమర్థుడని కూడా తారకి తెల్సు.

○ ○ ○

సన్నాయి శ్రావ్యంగా మోగుతున్నది.

మోకాలు మడిచి పెట్టుకొని రెండోకాలు బాసింపట్టులా కూర్చొని గడ్డాన్ని మోకాలి మీద ఆనించి సిగ్గుతో కళ్ళెత్తి వరుణ్ని చూస్తున్న తారని చూస్తే ఈ అమ్మాయేనా పెళ్ళి చేసుకోనని మారాం చేసింది అన్పిస్తుంది. జీలకఱ్ఱ, బెల్లం, మంగళసూత్ర ధారణ తతంగాలు పూర్తయ్యాయి. కొత్త జీవితం తలుపులు తెరిచి నూతన దంపతులకు ఆహ్వానం పలికింది.

"ప్రస్తుతానికి ఇది.. మన గది" శ్రీకాంత్ చిలిపిగా తార బుగ్గ మీటాడు..

"ప్రస్తుతానికి.. అంటే" తార కళ్ళెత్తి అడిగింది సూటిగా.

"మనం నూతన దంపతులం గదా! ఇది అన్నయ్య గది.. కొన్నాళ్ళు వాళ్ళు సర్దుకుంటారు" దగ్గరిగా తీసుకున్నాడామెను.

"కొన్నాళ్ళ తర్వాత" విడిపించుకుంటూ అడిగింది.

"అప్పటి సంగతి అప్పుడే" ఇక విడిపించుకోలేనంతగా హత్తుకున్నాడు. తార మాటలు పెదవుల లోపలే ఆగిపోయాయి.

అత్తింట ఎంత ప్రేమ, ఆదరణలున్నా తారకు లోలోపల ఏదో అసంతృప్తి. కొత్త దంపతులకు కొన్నాళ్ళ తర్వాత వంటిల్లే పడగ్గది కావటం.. ఆమెకు చేదుగా కన్పిస్తున్న నిజం!

"ఏదైనా పెద్ద ఇల్లు అద్దెకు తీసుకుందాం! ఎన్నాళ్ళిలా మనం ఇబ్బంది పడి వాళ్ళని ఇబ్బంది పెడతాం.. మనకంటూ ఓ గది ఉంటే బావుంటుంది కదూ!" భర్తతో నసిగింది తార.

"బావుందోయ్! ఇంతకాలంగా ఉంటున్న ఇల్లు.. మా చుట్టాలది కాబట్టి చవగ్గా అద్దెకిచ్చారు. ఈ మహానగరంలో మరో పెద్ద ఇల్లు అద్దెకి.. అంటే మనం భరించగలమా చెప్పు. ఈ ఇంట్లోనే మా అన్నయ్యకి పండంటి పిల్లలు పుట్టారు తెలుసా" కొంటెగా నవ్వాడు శ్రీకాంత్! అతనికి ఎలా చెప్పాలో తారకు తెలియలేదు.

ఉదయం ఆఫీసుకు వెళ్ళేదాకా ఇంటిపని.. శ్రీకాంత్‌ని పంపి, తనూ బాక్సులో ఇంత సర్దుకొని ఆఫీసుకు వెళ్ళటం, సాయంత్రం రావటం.. మళ్ళీ ఇంట్లో పని.. అంతా రొటీన్.

సినిమాలకి వెళ్ళాలన్నా ఇంట్లో ఉన్నవాళ్ళంతా వెళ్ళాలంటే చాలా ఖర్చు. అందర్నీ వదిలి తామిద్దరమే వెళితే బావుండదు. ఇలా మధ్యతరగతి త్యాగాలతో అమ్మ సమస్యలు పక్కనబెట్టక తప్పింది కాదు. అసలు అటువంటి తనదికాని తన సంసారంలోకి అమ్మని తెచ్చుకొని దగ్గర ఉంచుకోవటం ఎలా సాధ్యం?

ఒక ఊబి నుంచి బయట పడాలనుకుంది గానీ మరో ఊబిలో చిక్కుకున్నానని ఇప్పుడు తారకి బాగా అర్థమయింది. క్రమంగా ఏవో సంబంధాలు కుదిర్చి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేశారు అమ్మా, నాన్న. అమ్మతో మనసు విప్పి మాట్లాడే తీరికే లేనంతగా ఇద్దరూ బిజీగా జీవితం.. కొంత జరిగింది. అమ్మ ఎందుకు పరాయిగా తప్పించుకొని తిరుగుతోందో అర్థంకాని అయోమయ స్థితి!

చిన్న చెల్లి పెళ్ళి అయి అయాక తిరిగి వస్తూ

"ఇంక నా దగ్గరుండి పోమ్మా" అన్నం తింటున్న అమ్మ ఓసారి తలెత్తి పసిపిల్లను చూసినట్లు చూసింది తార మాటలకి.

"చూసిరాగలనేమో గానీ నీ దగ్గరే ఉండలేను తారా! అది నీ సంసారం. అందులో నేనెప్పుడూ అతిథినే" చురుగ్గా తెలియచెప్పిన నిజం అది!

"ప్చ్! నేననుకున్నదొకటి.. జరుగుతున్నదొకటి.. పెళ్ళి పెళ్ళి అని నా ప్రాణం తీశావు.." తార గొంతు నిండా చెప్పలేనంత నీరసం, నిస్సహాయతలు ధ్వనించాయి.

"అంటే.. పెళ్ళి చేసుకోకుండా ఈ నరకంలో ఎన్నాళ్ళుంటావు" కన్నబిడ్డతోనే తన కాపురం ఓ నరకం

అని చెప్పుకునే దుస్థితి ఏ తల్లికీ రాకూడనిది.

"నాన్ననించి దూరంగా నిన్ను తీసుకెళ్ళాలనుకున్నా. అందుకే బాగా చదువుకొని ఉద్యోగంలో చేరా.. కానీ".. తార కళ్ళు జలపాతాలయినాయి.

అమ్మ తారకేసి పరిశీలనగా ఓసారి చూసింది. చేయి కడుక్కుని కొంగుతో తుడుచుకుంటూ కూతురికి దగ్గరిగా వచ్చి తాత్వికురాలిలాగా మందహాసం చేసింది.

గడ్డం కింద చేయి వేసి తల పైకెత్తి కొంగుతో కూతురి కళ్ళు తుడిచింది. "తారా! మళ్ళీ మళ్ళీ చెప్పటానికి బ్రతికి ఉంటానో లేదో తెలీదమ్మా! ఆశలన్నీ నెరవేరనిదే జీవితం. ఎవరి జీవితం వారిదే తల్లీ! నా తలరాతను నువ్వు తిప్పి రాయలేవు.. నీకో తీరం దొరికింది.. అంతే" అమ్మ కళ్ళలో నీళ్ళు కన్పడకుండా తల తిప్పుకుంది. ఆమె గొంతు వణకటం తార దృష్టిని దాటిపోలేదు.

ఆ తర్వాత తిరిగి హైదరాబాదు వచ్చాక కొంత కోపం వల్లే.. అవును.. కోపం.. ఆడపిల్ల ఇల్లు పరాయిదన్న ఫీలింగ్ అమ్మకి..

ఉత్తరం రాయలేదు తార. వెళ్ళలేదు కూడా! తన మౌనం, కోపం తల్లిని పూర్తిగా జీవితంలో ఓడిపోయేట్లు చేస్తుందని తార అనుకోలేదు.

అమ్మ గురించిన ఆ దుర్వార్త టెలిగ్రాంగా రావటమే కలగా ఉంటుంది. జీవిత పాఠాలు నేర్పిన అమ్మ చైతన్య రహితంగా కన్పించటంతో స్పృహతప్పి పడిపోయింది తార.

అమ్మ ఉండగా ప్రతిదానికి ఆవిడని తిట్టి, కొట్టి సాధించిన నాన్న జడపదార్థంగా మిగిలాడు. ఆయన పట్ల గౌరవం, ప్రేమ లేవు. జాలిపడాలో లేదో కూడా అర్థంకాని పరిస్థితి. జీవిత భాగస్వామిగా జీవిత కాలం తన కష్టసుఖాల్లో భాగం పంచుకునే భార్య పట్ల కనీస మానవత్వాన్ని చూపలేని ఆయన స్వభావం తారకు ఎప్పటికీ అర్థంకానిది.

కాలచక్రం ఒకే గాడిలో తిరుగుతోంది. పిల్లలు.. ఉద్యోగినిగా తారకున్న సమస్యలు.. అందరిలాంటివే! సమస్యల్లో కూడా ప్రత్యేక సమస్యలేం లేవు. అందరిలా లోన్ తీసుకుని ఫ్లాట్ కొనుక్కున్నారు.. మొనాటనీ జీవితంలో మొయ్యలేనంత అసంతృప్తి తార హృదయంలో!

శ్రీకాంత్ తన తండ్రి అంత మూర్ఖుడు కాదు. కానీ కాల్కులేటెడ్ మనీ మైండెడ్ భర్త.. తార తనకోసం సర్దుకున్న గదిని పిల్లల గదిగా మార్చాడు.. మనది మనదే.. అంటూ రెండో గది తమ బెడ్‌రూం చేశాడు. ఇక మళ్ళీ మామూలే! తనకంటూ ఓ గది.. ఎక్కడ.. వంటిల్లే! పోపుల పెట్టె.. గ్యాస్ సిలెండర్.. కందిపప్పు.. చింతపండు డబ్బాలు.. అమ్మకిలాగే తారకు కూడా ఇప్పుడు అవే స్నేహితులు. మూగబాధ వినే జడనేస్తాలు.. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నకొద్దీ వాళ్ళ అభిరుచులు, ప్రపంచాలు వేరే!

ఆఫీసులో ఉండగా హఠాత్తుగా ఫోన్ వచ్చింది శ్రీకాంత్‌కు హార్ట్ ఎటాక్ అనీ! అంతే.. ఆ తర్వాత భర్త నోట ఓ మాట కూడా వినలేదు తార.. పిల్లల్నీ, ఆమెనూ వదిలి నిష్క్రమించాడు శ్రీకాంత్ శాశ్వతంగా..

భర్త తరఫు బంధువులు పరామర్శించింది డబ్బు గురించే!

తండ్రికి ఎప్పుడూ భారమే పిల్లలంటే! తారకి అంత దుఃఖంలోనూ నవ్వొచ్చింది. ఒంటరి జీవిత పోరాటం చిన్నప్పటి నుంచీ అలవాటేగా మరి! మెల్లమెల్లగా పరిస్థితులతో రాజీపడి అమ్మాయికి డిగ్రీ కాగానే పెళ్ళి చేసింది. దానికి ఉద్యోగం చేయాలని లేదుట. ఈ కాలం పిల్లలు వాళ్ళు.. బాధ్యతలు లేకుండా హాయిగా జీవితాన్ని ఎంజాయ్ చేయటం వాళ్ళ జన్మహక్కు. ఫ్లాట్ అద్దెకిచ్చి కోడలు ఆఫీసు దగ్గరగా చిన్న ఇంట్లోకి మారింది తార.

రిటైరు అయ్యాక వచ్చిన డబ్బును కూతురికీ, కొడుక్కీ పంచేసింది. మనసుకెంతో విశ్రాంతిగా ఉంది.

ఇల్లు సర్దుకోవటం పూర్తయింది.

డ్రాయింగ్ రూంలో గోడకి ఉన్న మేకుకు అమ్మ ఫోటో పెట్టెలోంచి తీసి కొంగుతో తుడిచి తగిలించింది ప్రేమగా.

తన గదిలోకి వెళ్ళి మంచం మీద కళ్ళు మూసుకుని

## నిత్యావసర వస్తువులు!

ఉద్యోగం – వరకట్నం...!
ఓటు, అసెంబ్లీ, సీటు ధరలు
పోటీపడి, ఆకాశంలో– విహరిస్తున్నాయి..!
విద్య కూడా, ఒక నిత్యావసర– వస్తువే..!
అంగడిలో–అత్యధిక ధరలు పలుకుతోంది,
ధనవంతులు–ఎగబడి–పోటీపడి కొనుక్కుంటున్నారు,
నల్లబజారులో..!
నిర్భాగ్యులు–నిలబడి చూస్తున్నారు,
నడివీధుల్లో–అమాయకుల్లా.

–పి. అనంత ప్రభాకర్ దత్తు